క్లుప్తంగా

ముగిసిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

తాడికొండ: గత 4 రోజులుగా కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియలో భాగంగా తాడికొండ మండలం లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఓటింగ్‌లో మొత్తం 494 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఎన్నికల నిర్వహణాధికారి ఎం గంగరాజు తెలిపారు. 5వ తేదీ నుంచి కొనసాగుతున్న ఈ ప్రక్రియలో బుధవారం వరకు 1996 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా ఇందులో తాడికొండ నియోజకవర్గం నుంచి 729 మంది ఓటు వినియోగించుకున్నారు. మంగళగిరి- 87, పొన్నూరు- 64, తెనాలి- 81, పత్తిపాడు-149, గుంటూరు వెస్ట్- 298, గుంటూరు ఈస్ట్- 94, ఇతర జిల్లాలకు సంబంధించి - 494 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రేపు కూడా పోలింగ్ ప్రక్రియ జరగనున్న నేపథ్యంలో మిగిలిన ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

శివాలయంలో అన్నదానం



మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో గాయత్రి యజ్ఞం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పందేటి సాంబశివరావు, కర్నాటి శివ సత్యనారాయణ, నంగళం ప్రసాద్, జూట్రు ఏడుకొండలు, కశారి విష్ణుమూర్తి, గూండా రామాంజనేయులు, దుంపల సోములు, దామర్ల వీరాస్వామి, నాగరాజు, ఖగ్గా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'నయవంచన' పుస్తకావిష్కరణ

–కార్యక్రమానికి హాజరైన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి



తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ పౌర సంఘాల 10 సంవత్సరాల నిరంకుశ పాలనపై రాసిన నయవంచన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విచ్చేసి నయవంచన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఢిల్లీ నుంచి వచ్చింది ఇండియా కూటమి బలపర్చిన గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు గెలుపు కోసమేనని అన్నారు. మీ అమూల్యమైన ఓటును వీరికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దోపిడీ జరుగుతోందని, మోదీ అధికారంలో ఉన్న నాటి నుంచి నేటి వరకు నిత్యావసర సరకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అన్నారు. సామాన్యులు బతికే స్థితిలో లేరని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ కంపెనీలను దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



తెనాలి రూరల్: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం సాయంత్రం తెనాలి వచ్చారు. మే 13వ తేదీ సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ముందుగా స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎం హైస్కూల్‌కు వచ్చిన ఎస్పీ, డీఎస్పీ ఎం. రమేష్, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబుతో కలిసి అక్కడ బూత్‌ల వద్ద పరిస్థితిని పరిశీలించారు. పట్టణంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆయన ఆదేశించారు. ఎక్కడ ఏ చిన్నపాటి ఘర్షణ, వివాదం కూడా జరగడానికి వీల్లేదన్నారు. అనుమానితులను ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. అక్కడి నుండి చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రానికి వెళ్లి పరిశీలించారు.

ల్యాప్‌టాప్ చోరీ

గుంటూరు ఈస్ట్: ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట 4/10వ లైనులోని మానస హాస్టల్‌లో ఎం.కిరణ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్ బుధవారం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నతోనే పేదల జీవితాల్లో వెలుగులు

- మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- దుగ్గిరాల మండలం చింతలపూడి, డీపీ అగ్రహారం, పెనుమూలి గ్రామాల్లో విస్తృత ప్రచారం
- గ్రామాల్లో హారతులు పట్టిన మహిళలు



దుగ్గిరాలలో ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య రాకకోసం మండే ఎండలో నిరీక్షిస్తున్న మహిళలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల మండలం చింతలపూడి, డీపీ అగ్రహారం, పెనుమూలి గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చింతలపూడి గ్రామ పరిధిలోని కృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, వైఎస్సార్ సీపీ ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలతో కలసి చింతలపూడి పురవీధుల్లో రోడ్ షో కార్యక్రమాన్ని, కొన్ని ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య చింతలపూడి గ్రామానికి విచ్చేయడంతో మహిళలు భారీగా రోడ్డు మీదకు వచ్చారు. వైఎస్సార్ సీపీ జెండాలు చేతపట్టి ఫ్యాను గుర్తుకు ఓటు వేస్తామంటూ నినదించారు. లావణ్య రాకకోసం మండుటెండలో వేచి ఉన్నారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 2 గంటల పాటు చింతలపూడిలో ప్రచార కార్యక్రమం జరిగింది. అక్కడి నుంచి పెనుమూలి గ్రామంలో ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచారం నిర్వహించారు. సాయంత్రం చిలువూరు గ్రామంలో ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగించారు. 'ఫ్యాను గుర్తుకు ఓటేద్దాం.. సంక్షేమాభివృద్ధిని సాధించుకుందాం' అంటూ ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచార వాహనంతో ముందుకు వెళుతూ నినాదాలు చేశారు.

మురుగుడు లావణ్య మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో ప్రతి గ్రామంలో అన్నదాతలు పంట పొలాలకు వెళ్లడానికి సరైన రహదారులు లేక పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన ఎమ్మెల్యే ఆర్కే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రతి డొంక రోడ్డు నిర్మాణాన్ని ప్రభుత్వ నిధులతో చేపట్టి రైతుల కష్టాలు తీర్చారన్నారు. దుగ్గిరాల మండలంలో పలు గ్రామాల్లో అంతర్గత డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. ఇళ్లులేని వారికి సొంత ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ఇప్పటికే 70 శాతం మంది ఇళ్లు నిర్మించుకున్నారని అన్నారు. ఒక పక్క అభివృద్ధి చేస్తూనే మరోపక్క సంక్షేమాన్ని అమలు చేసిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మరోసారి జగన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే పేదవర్గాలు ఆర్థికంగా ఎదగడమే కాకుండా సమాజంలో తలెత్తుకుని తిరుగుతారని అన్నారు. ప్రతిపక్ష అభ్యర్థి ఎక్కడో హైదరాబాద్‌లో ఉండి అనుచరులతో ఇక్కడ పరిపాలన సాగిస్తూ ఇప్పుడు ఎన్నికల్లో గెలవడానికి వందలాది మందిని దింపి ప్రచారం నిర్వహిస్తున్నారని విమర్శించారు. బీసీ అభ్యర్థి అయిన తనను కలవాలంటే నేరుగా తన దగ్గరకు రావచ్చని అన్నారు. ప్రతి పక్షంలో పోటీ చేస్తున్న వారిని కలవాలంటే వంద మందిని దాటుకుంటూ వెళ్లాలని అన్నారు. ఎక్కడ నుండో వచ్చి 10 నిమిషాలు కూడా మన బాధలు వినే సమయంలేక కారుల్లో ఎక్కి కూర్చునే వారిని గెలిపిస్తే అభివృద్ధి ఎక్కడి గొంగలి అక్కడే అన్న చందంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు తనను తోబుట్టువులా భావించి, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వడ్డేశ్వరం రజనీకాంత్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు సయ్యద్ ఇస్మాయిల్, మండల పార్టీ అధ్యక్షులు శృంగారపాటి రత్నం, బీసీ సెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డి.వి.ఆర్.), వీరయ్య, షేక్ సుభాని, జేసీఎస్ కన్వీనర్ ఈమనేని రవీంద్ర, ఎంపీటీసీలు షేక్ సల్మా, కొండూరు సుమన్, బర్మా రాంబాబు, ఈమనేని ధనుంజయ్, సర్పంచ్‌లు ఇత్తడి రమేష్, పలుకూరి మేరిరాణి, నజీర్, రంగారెడ్డి, రమేష్, నల్లనూకల కోటి యాదవ్, తాడిబోయిన వెంకటరావు, గేలం ఫణీంద్ర, షేక్ నాగూర్, పలుకూరి శామ్యూల్, దానబోయిన శ్రీనివాసరావు, రవి, కిరణ్, శేషిరెడ్డి, రవీంద్రారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కృష్ణ మందిరంలో మురుగుడు లావణ్య

ప్రచార పర్వం

జగనన్న పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



ప్రచారంలో మేకతోటి హర్షిత్, సాయినివ్య



భారీ ఊరేగింపు నిర్వహిస్తున్న అభిమానులు

ఫిరంగిపురం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగించారని తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్, పార్లమెంట్ అభ్యర్థి కిలారు రోశయ్య కుమార్తె సాయినివ్య అన్నారు. మండలంలోని శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించారన్నారు. గతంలో పథకాలు రావాలంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదని నేడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రం ద్వారా అందజేసి తిరిగి రైతు పండించిన పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగేలు చేసేలా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.

ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మేకతోటి సుచరితను, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కిలారు రోశయ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముందుగా తక్కెళ్లపాడు గ్రామంలోని అంకమ్మతల్లి, ఆంజనేయస్వామి, శివాలయంలో పూజలు చేశారు. స్థానిక నాయకులు, అభిమానులు హర్షిత్, సాయినివ్యలకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్.షహేలానర్గీస్, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం సునీత, వైస్ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, సర్పంచ్ విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, ఎం.ఈశ్వరరెడ్డి, యొహోషువా, నాగేశ్వరరావు, మరియమ్మ, శౌరెడ్డి, జోకోబురెడ్డి, వెలంగిణిరెడ్డి, తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి, మస్తాన్‌రావు, ఐ.శ్రీనివాసరెడ్డి, రామాంజనేయరెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, భద్రారెడ్డి, గురవారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వై.శ్రీనివాసరెడ్డి, డి.అంజిరెడ్డి, టి.అంకమ్మ, ముసలయ్య, ఈ.వెంకటస్వామి, బాజి, వి.శ్రీనివాసరావు, సిద్దయ్య, చిన్న కోటేశ్వరరావు, కె.దయా, మోషే, వందనం, సునాదం, జోజి, సంతోషరావు, జయరావు, అనిల్‌లు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కుమార్తె రిషిక
- తాళ్లాయపాలెంలో రోశయ్య కుమార్తె కిలారి సాయి నవ్యశ్రీతో కలిసి ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న సుచరిత కుమార్తె రిషిక, రోశయ్య కుమార్తె సాయి నవ్యశ్రీ

తాళ్లాయపాలెం(తాడికొండ): రాష్ట్రంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత కుమార్తె రిషిక, ఎంపీ కిలారి రోశయ్య కుమార్తె కిలారి సాయి నవ్యశ్రీ అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి నవరత్నాల పథకాలను ప్రవేశపెట్టి దేశంలోనే రోల్ మోడల్ పాలన అందించారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో పేదవాడికి సంక్షేమం అందాలంటే ఆయా పార్టీల నాయకుల సిఫార్సుల కోసం చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. కానీ నేడు అందుకు భిన్నంగా పాలనే ఇంటి వద్దకు చేరేలా రూపొందించిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ అన్ని రాష్ట్రాలను ఆలోచనలో పడవేసిందన్నారు. ప్రజలు తనను నమ్మడం లేదని గ్రహించిన చంద్రబాబు గెలుపుకోసం జగన్ మోహన్‌రెడ్డిని ఒంటరిగా పోటీ చేసి ఓడించడం సాధ్యపడక పొత్తుల పేరుతో ఎత్తులు వేస్తుండటం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల పాలనలో పారదర్శకతతో ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధిని చేరవేసిన జగనన్న మీకు మేలు జరిగితేనే నాకు ఓటేయండని అడుగుతున్నారని అన్నారు. తాడికొండ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న ఎమ్మెల్యే సుచరితను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలను ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు కొప్పుల శేషగిరిరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి చలివేంద్రం సురేష్, జిల్లా జేసీఎస్ కన్వీనర్ రమణారెడ్డి, రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి బొర్రా వెంకట శివారెడ్డి, జిల్లా విద్యార్థి విభాగం సహాయ కార్యదర్శి చలివేంద్రం కార్తీక్, గ్రామపార్టీ అధ్యక్షుడు మిక్కిలి సాల్మన్ రాజు, మేడిద శ్రీ హరి, బండ్ల శ్రీకాంత్, గడ్డం జయరాం, కోలేటి అనీల్, ఐనవోలు సుధీర్, కట్టెపోగు గోపి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

- వార్డులు, గ్రామాలలో ప్రచారం కొనసాగిస్తున్న స్థానిక నాయకులు
- భారీగా హాజరవుతున్న ప్రజలు
- జనాదరణ లభిస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో పెరిగిన ఉత్సాహం



మంగళగిరిలోని స్థానిక నాయకుల ప్రచారం



కృష్ణాయపాలెంలో...

మంగళగిరి: ఎన్నికలు మరో నాలుగు రోజులుండడంతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రచారం ఊపందుకుంది. పట్టణంతో పాటు గ్రామాలలోని వార్డులలో స్థానిక నాయకులు ముమ్మరంగా ప్రచారం కొనసాగిస్తూ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్యను గెలిపించాలని కోరుతున్నారు. ఓటర్ల నుంచి భారీగా స్పందన లభిస్తుండడంతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక నాయకులు ఎక్కడికక్కడ వార్డుల వారీగా ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఆయా వార్డులలో ప్రజలనుంచి వస్తున్న స్పందనతో లావణ్య విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేస్తున్నారు. లావణ్యతో పాటు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక వార్డు కౌన్సిలర్లు, గ్రామ పార్టీ నాయకులు ఎక్కడికక్కడ విస్తృతంగా పర్యటిస్తుండడంతో క్యాడర్ మరింత జోరుగా ప్రచారంలో పాల్గొని లావణ్య విజయం కోసం కృషి చేస్తున్నారు.

మైనార్టీల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి



కొర్రపాడు ప్రచారంలో జేసీఎస్ కన్వీనర్ నాసర్ వలి అబ్బాస్, నాయకులు

మేడికొండూరు : మండల పరిధిలోని పేరేచర్ల సెంటర్‌లో ఒకటో నంబరు వద్ద ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను, నాల్గో నంబరు వద్ద ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరితను గెలిపించాలని కోరుతూ గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో మైనార్టీ కాలనీలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సుమారు 200 మంది కార్యకర్తలతో పేరేచర్ల మైనార్టీ కాలనీలో గడప గడపకూ తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో షేక్ సుభాని, సయ్యద్‌బాషా, జాన్‌బీరా, షేక్ నాగుల్ షరీఫ్, దర్గా ఘన్‌సైదా, అబ్దుల్ హసన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కొర్రపాడు గ్రామంలో మండల జేసీఎస్ కన్వీనర్ నాసర్‌వలి అబ్బాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల జీవితాలు మార్చిన సీఎం వైఎస్.జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరితకు, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని గ్రామంలో గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ మరియదాసు, ఎంపీటీసీ లక్ష్మణబాబు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

సాహితీ ఆణిముత్యం రవీంద్రనాథ్ ఠాగూర్



లక్ష్మీపురం: భారతీయ సాహితీ తేజాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ అని, మన దేశానికి తొలి నోబుల్ పురస్కారాన్ని అందించిన ఘనత ఆయనదేనని సీనియర్ గాయకుడు, విశ్రాంత అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఠాగూర్ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతా వాదిగా ఠాగూర్ చరిత్రలో నిలిపోయారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు పి.మొగిలి మాట్లాడారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం



ప్రమాదానికి కారణమైన కారు ఇదే

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ కారు అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఓ యువకుడ్ని ఢీ కొట్టింది. ఆ యువకుడికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలోనే మృతి చెందాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనలో ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుంచి మంగళగిరి వెళ్తున్న కారు పోలకంపాడు హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో ఓ ఆటోను క్రాస్ చేస్తూ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన పిల్లి రాజు (32)ను కారు గుద్దడంతో పది అడుగుల పైకి లేచి కారు అద్దంపై పడ్డాడు.ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. విజయవాడలో నివసిస్తూ ఇబ్రహీంపట్నం పవర్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్న పిల్లి రాజు తాడేపల్లి ఆర్ఎంఎస్ కాలనీలో అత్తగారి ఇంటి దగ్గర నుంచి విజయవాడ వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కారుపై పడి తీవ్ర గాయమైన పిల్లిరాజును స్థానికులు ఆటోలో తాడేపల్లిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. భార్య శ్రావణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ఇదిలా ఉండగా ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న వ్యక్తులు అక్కడ ఉన్న వారిని ఎవరినీ కారు వద్దకు రాకుండా జాగ్రత్తలు తీసుకుని కారుకు ఉన్న నెంబరు ప్లేట్లు తొలగించి అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేపట్టి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మంత్రిపై దాడి అమానవీయ చర్య

నెహ్రూనగర్: హోంమంత్రి తానేటి వనితపై దాడి అమానవీయ చర్య అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. బుధవారం కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తూర్పు గోదావరిలో నల్లజర్లలో పర్యటిస్తున్న ఆమెపై కొందరు దాడి చేయడం బాధాకరమన్నారు. ఒక దళిత మహిళపై ఈ విధంగా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలో అన్ని మారుతున్నాయి కాని దళితులపై దాడులు మాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటుహక్కుపై ప్రజల్లో అవగాహన

తెనాలి రూరల్: దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్సీ) ఆధ్వర్యంలో ఓటరు చైతన్య ప్రచారోద్యమాన్ని బుధవారం నిర్వహించారు. సంస్థ తెనాలి సిటీ కోఆర్డినేటర్ బి. రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా భారతదేశాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా రూపొందించారని చెప్పారు. 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించి రాజకీయ సమానత్వ సాధనకు పునాది వేశారని తెలిపారు. దేశాన్ని ఏలే ప్రధాని నుండి దేశంలో చిట్టచివరి మనిషి వరకు ఒకే ఓటు దానికి ఒకే విలువ అని తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బుజ్జిబాబు, తెనాలి దేవదాసు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్, ఇస్లాంపేటలో నివాసముండే టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు గాలయ్య ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సీపీ నులకపేట కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వేణుగోపాల సోమిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఎన్నడూ లేని అభివృద్ధితో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ రాజ్యాధికారాన్ని వారికి అప్పజెబుతున్నారని, భవిష్యత్తులో ప్రతిపక్షంలో ఉన్న కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్ సీపీలోకి భారీగా వస్తారని అన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో షేక్ నవాజ్, కొండూరి దుర్గారావు, కాసాల బాలాజీ, యర్రంశెట్టి నాగేశ్వరరావు, కొమరం దుర్గా ప్రసాద్, అబ్దుల్ రబ్ (అన్వర్), అక్తరున్నీసా, అబ్దుల్ రఫీ, అబ్దుల్ రహమాన్, అబ్దుల్ రభీబ్, షేక్ అబ్దుల్ హక్ తదితరులతో పాటు మరో 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ ఈదుల మూడి డేవిడ్ రాజు, మాజీ కౌన్సిలర్లు ఎండి గోరే, మాచర్ల అబ్బు తదితరులు ఉన్నారు.

ఐటీఐలో 10లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

తెనాలి రూరల్: ప్రభుత్వ/ప్రైవేటు పారిశ్రామిక శిక్షణసంస్థ (ఐటీఐల్లో) ఆగస్టు 2024 విద్యా సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెనాలి ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా తెనాలి జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థ, గుంటూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థలలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకుని, సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ పూర్తి చేయించుకున్న అభ్యర్థులే జూన్ నెలలో జరిగే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. వివరాలకు 9347795839, 6304572793 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.